నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
10 | నిజామాబాద్, మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | NIZAMABAD




తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత –అనిల్ దంపతులతోపాటు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అధినేతకు బర్త్‌డే విషెస్



కామారెడ్డి జిల్లా కేంద్రంలో తన నివాసం వద్ద మొక్కనాటి నీళ్లు పోస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు



# పండుగలా.. జననేత బర్త్‌డే

- ఉమ్మడి జిల్లాలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు
- కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు
- పల్లెలు, పచ్చని పొలాల్లో కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- గులాబీ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిన సేవా కార్యక్రమాలు



తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఫొటో అల్బమ్‌ను కేసీఆర్‌కు అందజేస్తున్న వేముల

**తెలంగాణ ప్రదాత,** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగ వాతావరణంలో జరుపుకొన్న వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్‌చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రాలతోపాటు పల్లెలు, పంట పొలాల్లో కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ మండలాల్లో మొక్కలు నాటారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, దవాఖానల్లో రోగులకు పండ్లు, బ్రెడ్‌ప్యాకెట్లను పంపిణీ చేశారు. తెలంగాణ ఉద్యమ సూర్యుడు, ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ధీరుడు కేసీఆర్ అని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 17



లింగంపేట మండలం భవానీపేట గ్రామంలో పంట పొలాల్లో కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకుంటున్న బాజిరెడ్డి కుటుంబీకులు

## సుస్థిరమైన పాలన అందించిన ఘనత కేసీఆర్‌దే

- ఏడాది కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం
- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సారంగాపూర్, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో పదేండ్లపాటు సుస్థిర పాలన అందించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదిన వేడుకలను నిజామాబాద్‌లోని బాజిరెడ్డి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులతో కేక్ కట్ చేయించి స్వీట్లు తినిపించారు. అనంతరం బాజిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి, ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం రేవంత్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రేవంత్ ఏడాది పాలనపై విసుగు చెందిన అన్ని వర్గాల ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని బాజిరెడ్డి అన్నారు. కేసీఆర్ నిండు నూరేళ్లు జీవించి భవిష్యత్తులో సీఎంగా ఉండి స్వచ్ఛమైన పాలన అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ పాల్గొన్నారు.



కేసీఆర్‌కు శాలువా కప్పుతున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్



ఎల్లారెడ్డిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ శ్రేణులు




మహ్మద్‌నగర్ లో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే షిండే, బీఆర్ఎస్ నాయకులు

# బకాయిలు చెల్లించాలి..

ఎత్తొండ విండోకు డీసీసీబీ నోటీసులు

కోటగిరి, ఫిబ్రవరి 17: మండలంలోని ఎత్తొండ వ్యవసాయ సహకార సంఘానికి కేంద్ర సహకార బ్యాంకు నోటీసులు పంపింది. బ్యాంకు ద్వారా తీసుకున్న రూ.1,34,10,862 రుణం చెల్లించాలని నోటీసులో పేర్కొంది. రుణం చెల్లించాలని ఇదివరకే నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందనా రాకపోవడంతో డీసీసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడం గమనార్హం. రుణం చెల్లించకపోతే బ్యాంకుకు (తనఖా) పెట్టిన 2 ఎకరాల13 సెంట్ల భూమిని వేలం వేస్తామని డీసీసీబీ డిమాండ్ నోటీసును జారీ చేసింది. క్యాష్ క్రెడిట్ కింద తీసుకున్న రుణానికి సంబంధించి బకాయిల కోసం భూములు వేలం వేస్తామని అధికారులు ప్రకటించారు.





FORM NO.6

Demand notice prior to sale ... property/Attachment of immovable property

Notice of demand to ... Kotgir District: Nizamabad.

Take Notice that the Registrar ... of Rs.1,34,10,862/- being the ... order No 128/CC/2024-25 ... Nizamabad District Central Co-op ... you are required to pay the ... the date of service of this ... properties specified in the ... in open auction as per ... Societies Act read with Rule ...

ఎత్తొండ సహకార సంఘానికి డీసీసీబీ పంపిన నోటీసు

# పెద్దవాగులో ఇసుక నాగులు

**ట్రాక్టర్‌కు రూ.50వేలు.. ట్రిప్పుకు రూ.500**

- గ్రామ కమిటీలకు చెల్లించాలని ఒప్పందాలు
- బాల్కొండ నియోజకవర్గంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- బట్టాపూర్ పెద్దవాగులో తవ్వకాలు
- సీపీ హెచ్చరికలు బుట్టదాఖలు

**జిల్లాలో ఇసుక అక్రమ రవాణా** యథేచ్ఛగా కొనసాగుతున్నది. ఇసుక దందా నియంత్రణకు యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇసుకాసురులు రెచ్చిపోతూనే ఉన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని సీఎం చెప్పినా, ఇసుక అక్రమరవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించినా ఫలితం కనిపించడంలేదు. సీఎం, సీపీ హెచ్చరికలను బాల్కొండ నియోజకవర్గంలోని అధికారపార్టీ నాయకులు, అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో ఇసుక దందాకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. అధికారులకు ముడుపులు చెల్లిస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. నియోజకవర్గంలో అక్రమార్కులకు ఇసుక దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా మారింది.

–మోర్తాడ్, ఫిబ్రవరి 17




**బట్టాపూర్** నుంచి ఇసుక అక్రమ రవాణా చేసేందుకు ఆరు నెలలుగా అధికారపార్టీకి చెందిన వారు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఆరంభంలో రోజుకు రూ.లక్షా 50వేలు చెల్లించి రాత్రుల్లో ఇసుకను తరలించుకోవాలని గ్రామకమిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ముందుగానే బయటపెట్టడంతో ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ పడింది. తాజాగా సోమవారం ఉదయం నుంచి బట్టాపూర్ పెద్దవాగులో ఇసుక తవ్వకాలను ప్రారంభించారు. ఇందుకోసం ఒక్కో ట్రాక్టర్‌కు రూ.50వేలు గ్రామకమిటీకి చెల్లించాలనే ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. అదే విధంగా ట్రిప్పుకు రూ.500 చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ట్రిప్పుకు వసూలు చేసే డబ్బులు అధికారుల మామూళ్ల కోసమని, మొత్తం 34 ట్రాక్టర్లకు సంబంధించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.50వేల చొప్పున గ్రామకమిటీకి ముట్టినట్లు సమాచారం. ఉదయమే గ్రామకమిటీకి డబ్బులు కట్టినవారంతా ట్రాక్టర్లను వాగులోకి మోహరించి ఇసుక తవ్వకాలను ప్రారంభించారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

**పోలీసులు, అధికారుల మౌనం**

బట్టాపూర్ శివారులో సోమవారం ఇసుక తవ్వకాలు చేపట్టారు. అయితే పక్కనే ఉన్న మెండోరా మండలం వెల్కటూర్ గ్రామకమిటీ తమ గ్రామ సరిహద్దులోకి వస్తుందనే ఫిర్యాదు చేయడంతో ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్‌పడింది. వెల్కటూర్ గ్రామకమిటీ ఫిర్యాదు చేయడంతో ఏర్గట్ల పోలీసులు వచ్చి బట్టాపూర్ గ్రామ కమిటీతో మాట్లాడినట్లు సమాచారం. కానీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా ఏ ఒక్క ట్రాక్టర్‌ను పోలీసులు ఎందుకు పట్టుకోలేదన్నదానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బట్టాపూర్ నుంచి కమ్మర్‌పల్లి వరకు ఇసుక ట్రాక్టర్లు వచ్చినా అధికారులకు తెలియకుండా ఉంటుందా అనేది సమాధానం లేనిప్రశ్న. ఇసుక దందా విషయంలో సీపీ సీరియస్‌గా ఉన్నా మండల స్థాయి పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదు, రెవెన్యూ అధికారులు కూడా ఏం చేస్తున్నారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**గోదావరిలో తవ్వకాలు..లారీల్లో తరలింపు**

ఏర్గట్ల మండలం దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామాల్లో కూడా రాత్రివేళ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. గోదావరిలో తవ్వకాలు చేపట్టి రాత్రుల్లో లారీల్లో పంపిస్తున్నారు. ఈ తతంగం నిత్యం కొనసాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తడ్‌పాకల్‌లో ఇసుక అక్రమ రవాణాను గ్రామస్తులు నిలిపివేయించారు. ఒక గ్రామంలో ఆపివేయడం, మరో గ్రామంలో ఇసుక అక్రమ రవాణాకు ఊతమివ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకాసురులు తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



బట్టాపూర్ శివారులోని వాగులో తట్ట, పారలతో కూలీలు

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

- అప్పులు తీర్చలేక ఉరేసుకొని ఆత్మహత్య
- కామారెడ్డి జిల్లా దేవునిపల్లిలో ఘటన



సంజయ్ (ఫైల్)

కామారెడ్డి, ఫిబ్రవరి 17: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన ఓ యువకుడు అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో చోటుచేసుకున్నది. దేవునిపల్లి ఎస్సై రాజు, కుటుంబీకుల కథనం ప్రకారం.. దేవునిపల్లి గ్రామానికి చెందిన దేవల సంజయ్‌కు నాలుగేండ్ల క్రితం శ్రీలతతో వివాహమైంది. వీరికి మూడున్నరేండ్ల కూతురు, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న సంజయ్ రెండేండ్ల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అప్పటికే అప్పులు ఉండగా.. బెట్టింగ్ ఆడడంతో సుమారు రూ. 80 లక్షల వర కు అప్పులు పెరిగాయి. అప్పులు తీర్చడానికి ఉన్న ఇంటిని అమ్మడానికి ప్రయత్నించినా..అనుకున్నంతగా డబ్బులు రాకపోవడంతో విరమించుకున్నాడు. భార్య ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఆమె తన తల్లిగారింటికి (క్రిష్ణాజివాడి) ఆరు నెలల క్రితం వెళ్లిపోయింది. అప్పుడప్పుడు తన భార్యతో సంజయ్ ఫోన్‌లో మాట్లాడే క్రమంలో ఆదివారం సాయంత్రం కూడా శ్రీలతకు ఫోన్ చేసి డబ్బుల విషయంలో కలత చెందాడు. అప్పులు కట్టలేక జీవితంపై విరక్తి చెంది తీవ్ర మనస్తాపంతో ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజు తెలిపారు. తన భర్త ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని భార్య తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# బాన్సువాడ కాంగ్రెస్‌లో వర్గపోరు!

- 'ఏనుగు' వర్గీయులపై కేసు నమోదు
- ముఖ్య నేతల మధ్య మరింత ముదిరిన వివాదం

రుద్రూర్, ఫిబ్రవరి 17: బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నది. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులపై తాజాగా పోలీసు కేసు నమోదు కావడం.. పార్టీలో నెలకొన్న అంతర్గత పోరుకు అద్దం పడుతున్నది. ఇటీవల మోస్రా మండలంలో జరిగిన పార్టీ సంబంధిత కార్యక్రమానికి సంబంధించిన విభేదాలే ఈ కేసు నమోదుకు ప్రధాన కారణమని ప్రచారం జరుగుతున్నది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వర్గీయుల ఫిర్యాదు మేరకే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. బాన్సువాడలో ఏనుగు రవీందర్‌రెడ్డి, పోచారం మధ్య చాలా కాలంగా ఆధిపత్య పోరు నడుస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో రవీందర్‌రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం ఓడించారు. ఆ తర్వాత కొద్దికాలానికే పోచారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో బాన్సువాడ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. నియోజకవర్గంలో పట్టు పెంచుకునేందుకు ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. ఈ క్రమంలో అనుచరుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఇటీవల మోస్రా మండలంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో రెండు వర్గాల మధ్య విభేదాలు బయటపడ్డాయి. పోచారం శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని, దీన్ని అడ్డుకుంటామని రవీందర్‌రెడ్డి వర్గం హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డు పడుతున్నారని పోచారం వర్గం వారు ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో ఏనుగు వర్గీయులు 28 మందిపై కేసు నమోదైంది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తున్నారని రవీందర్‌రెడ్డి వర్గీయులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

## విద్యార్థినితో అసభ్యకర చేష్టలు

**ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు**

గాంధారి, ఫిబ్రవరి 17: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు రమేశ్ పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినితో అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు అసభ్యకర చేష్టలు చేసేవాడు. అంతేగాకుండా విద్యార్థిని తల్లిదండ్రుల ఫోన్ నంబర్ తీసుకొని, రాత్రివేళల్లో వారికి అసభ్యకరంగా వాట్సాప్ మెస్సేజ్‌లు పంపించేవాడు. ఈ విషయమై విద్యార్థిని తల్లిదండ్రులు సోమవారం గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడు రమేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సదరు ఉపాధ్యాయుడికి ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం వచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులే వారి పట్ల అభ్యకరంగా ప్రవర్తిస్తే , గురువు అనే పదానికి అర్థం లేకుండా పోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.